సాక్షి
ఏలూరు
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



అండగా 'మత్స్య కిసాన్'
ఆక్వా రంగంలో రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. 8లో ▸



కార్మికులకు కన్నీళ్లే
కార్మికుల కోసం పలు చట్టాలు ఉన్నా వాటి ప్రయోజనం మాత్రం లబ్ధిదారులకు అందడం లేదు. పథకాలు దరి చేరడం లేదు. 8లో ▸



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడు మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో ▸

కూటమి నేతలకే పల్లె పండుగ

పంచుకో.. దోచుకో..

- పల్లె పండుగలో జిల్లాకు రూ.46.48 కోట్లతో 360 రోడ్ల మంజూరు
- నేతలు సిఫార్సు చేసిన చోటే పనులు
- రూ.20 కోట్లతో 299 పనులు పూర్తి
- కొన్నిచోట్ల చేపల చెరువులు, ఖాళీ స్థలాలకు రహదారులు
- గత టీడీపీ హయాంలో చేసిన పనులకూ ఇప్పుడు బిల్లులు చేసుకునే ప్రయత్నాలు

పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామ శివార్ల నుంచి పంట పొలాలు, ఆక్వా చెరువులకు వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.30 లక్షలతో 482 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు. పంట, ఆక్వా ఉత్పత్తులు తరలించుకునేందుకు ఈ రోడ్డును వినియోగిస్తుంటారు. గ్రామంలోని జనావాసాల్లో పలుచోట్ల రహదారుల సదుపాయం సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అక్కడ కాదని పొలాలు, చెరువులకు వెళ్లే కంకర రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడం గమనార్హం.

భీమవరం రూరల్ మండలం దొంగపిండి గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి ప్రాంతంలో దాదాపు పది కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. మట్టిరోడ్డుతో వర్షం వస్తే రాకపోకలకు ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామంలోని మరోచోట ఖాళీ స్థలాల మీదుగా కొన్ని కుటుంబాలు వారు నివసిస్తున్న ప్రాంతానికి రూ.11.75 లక్షల వ్యయంతో 137 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేశారు.



పెంటపాడు మండలం ఉమామహేశ్వరం శివార్లలో పొలాల్లోకి వేసిన సీసీ రోడ్డు



భీమవరం రూరల్ దొంగపిండిలో ఖాళీ స్థలాల మీదుగా వేసిన సీసీ రోడ్డు

సాక్షి, భీమవరం: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి గత అక్టోబరులో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 350 పంచాయతీల పరిధిలో రూ.46.48 కోట్ల వ్యయంతో 66.6 కి.మీ రోడ్ల అభివృద్ధికి 360 పనులు మంజూరు చేసింది. వీటిలో 53.55 కి.మీ మేర రూ.42.42 కోట్ల విలువైన 349 సీసీ రోడ్లు, 11.67 కి.మీ మేర రూ.3.71 కోట్ల విలువైన తొమ్మిది బీటీ రోడ్లు, 1.3 కి.మీ మేర రూ.35 లక్షల విలువైన రెండు డబ్ల్యూబీఎం రోడ్లు ఉన్నాయి. కూటమి నాయకులు సూచించిన వారికే ఆయా పనులను కట్టబెట్టారు. కొన్నిచోట్ల కూటమి నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు చేస్తుండగా, మరికొన్ని చోట్ల తమకు పర్సంటేజీలు ఇచ్చేలా కాంట్రాక్టర్లకు పనులను అప్పగించినట్టు తెలుస్తోంది.

నాణ్యతపై అనుమానాలు

పల్లె పండుగ రోడ్ల నిర్మాణ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ఇప్పటివరకు సుమారు రూ.20 కోట్ల విలువైన 45.8 కి.మీ మేర 295 సీసీ రోడ్ల పనులు చేయగా, 2.8 కి.మీ మేర రూ.95 లక్షల విలువైన రెండు బీటీ రోడ్లు, 1.4 కి.మీ మేర రూ.24 లక్షల విలువైన రెండు డబ్ల్యూబీఎం రోడ్డు పనులు జరిగాయి. పలుచోట్ల పనుల్లో నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ రోడ్లు నిర్మించినా బెర్ములు వేయకపోవడంతో రోడ్ల అంచులు ప్రమాదభరితంగా ఉంటున్నాయని స్థానికులు అంటున్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు

ప్రజావసరాల మేరకు రోడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. కాలనీలు, గ్రామ శివార్లలోని జనావాసాల్లో రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లె పండుగలో చేపట్టాల్సిన పనులు గుర్తించేందుకు పేరుకు గ్రామ సభలు నిర్వహించినా కూటమి నాయకులు పెట్టిన పనులనే అధికారులు ఆమోదించారు. ఎక్కువ మంది జనం నివసిస్తున్న ప్రాంతాలు, ముంపు బారిన పడే కాలనీల్లో కాదని తమకు కావాల్సిన చోట పనులు ప్రతిపాదించారని, తమ భూముల విలువలు పెంచుకునేలా ఖాళీ స్థలాలు, పొలాలు, చెరువులకు రోడ్లు వేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల పాత సీసీ రోడ్లపై మరలా కొత్తగా సీసీ రోడ్లు వేస్తుండటంతో పూర్వపు ఇళ్లు పల్లమైపోయి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గత టీడీపీ హయాంలో చేసిన రోడ్లకు కొత్తగా మెరుగులు దిద్ది బిల్లులు చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా పనులు పూర్తయిన మేరకు ఇప్పటివరకు రూ.1.75 కోట్ల బిల్లులు చెల్లింపులు చేయగా మరో రూ.11.5 కోట్ల మేర బిల్లులు చెల్లించేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా అక్రమాలకు తావులేకుండా నిబంధనల మేరకే పనులు చేస్తున్నట్టు డ్వామా అధికారులు చెబుతున్నారు.

సమన్వయంతో శివరాత్రి తీర్థం పనులు

దేవదాయ శాఖ ఏసీ రంగారావు



తెప్పోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కైకలూరు: అధికారులంతా సమన్వయంతో పనిచేసి కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని దేవదాయశాఖ సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావు అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై శనివారం ఆలయం వద్ద రెండో విడత సమావేశం నిర్వహించారు. ఈఓ వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఆయా శాఖలు తీసుకున్న చర్యలపై చర్చ జరిగింది. సీఐ వి.రవికుమార్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా రెండు రహదారులు ఏర్పాటుచేశామని, సుమారు 200 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. కోనేరు వద్ద అపశ్రుతులు తలెత్తకుండా కోనేరు చుట్టూ ఫెన్సింగ్ ఎత్తు పెంచామన్నారు. ఈనెల 25న రాత్రి 1.20 గంటలకు స్వామి కల్యాణం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. 26న మహాశివరాత్రి తీర్థంతో పాటు రాత్రి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం అధికారులు కోనేరు, తెప్పోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, దేవదాయశాఖ గుడివాడ తనిఖీదారు వి.సుధాకర్, ఎస్సై వి.వెంకటేశ్వరరావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం తగదు



ఏలూరులో ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ (ఆప్కాస్)ను రద్దు చేయాలని చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏలూరు నగరపాలక సంస్థ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద శనివారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఆప్కాస్ రద్దు చేయొద్దు, ఆప్కాస్ ఉద్యోగులను ప్రైవేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అప్పజెప్పొద్దు, ఆప్కాస్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని నినదించారు. మున్సిపల్ వర్కర్స్ ఎంపాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. సోమయ్య మాట్లాడుతూ 2019లో జగన్ ప్రభుత్వంలో ఆప్కాస్ సంస్థ నెలకొల్పారని, దీని వల్ల కార్మికులకు చాలా మేలు జరిగిందన్నారు. ప్రతినెలా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నారని, పీఎఫ్, ఈఎస్ఐలు సకాలంలో చేస్తున్నారని, కనీస వేతనం అమలు చేస్తున్నారని అన్నారు. ఆప్కాస్ లేకుంటే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆప్కాస్‌లో ఉన్న లక్ష మంది ఉద్యోగులతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని, నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆప్కాస్ రద్దు ఆలోచన వీడాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు, కేవీపీఎస్ నగర నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్–2 రోస్టర్ విధానంలో తప్పులు



ఏలూరులో జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రూప్–2 ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ప్రకటించిన రోస్టర్ విధానంలో నెలకొన్న తప్పులను వెంటనే సవరించాలని గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు రాసే అభ్యర్థులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. పి.రఘురామ్ అనే అభ్యర్థి మాట్లాడుతూ రోస్టర్ విధానంలో తప్పుల కారణంగా అభ్యర్థుల్లో గందరగోళం నెలకొందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు అభ్యర్థులు ఆందోళనలు చేస్తున్నా ఏపీపీఎస్సీ అధికారుల్లో చలనం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు సమస్యలను తెలియజేసినా ప్రయోజనం లేదన్నారు. పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ మొండి వైఖరి వీడాలని, అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

బాలల చట్టాలు పక్కాగా అమలుచేయాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్

ఏలూరు (టూటౌన్): బాలల సంక్షేమం కోసం ఉన్న చట్టాలను అధికారులు పక్కాగా అమలు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్ కుమార్ సూచించారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జ్యువనైల్ పోలీస్ యూనిట్‌కు జ్యువనైల్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల సంక్షేమ చట్టాలపై అధికారులు ఎప్పటికప్పుడు తర్ఫీదు పొంది చిన్నారుల సంక్షేమానికి కృషిచేయాలన్నారు. చట్టంతో విభేదించిన బాలలతో ప్రవర్తించాల్సిన విధి విధానాలు, వారికి కల్పించాల్సిన పునరావాస సౌకర్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాల నిరోధానికి కృషి చేయాలన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కేకేవీ బులి కృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ జ్యువనైల్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద, డీసీపీఓలు సూర్య చక్రవేణి, రాజేష్, ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆ కాలేజీపై చర్యలు తీసుకోండి



ఆర్ఐఓకు వినతిపత్రం సమర్పిస్తున్న జీవన్‌కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు లేకుండా శ్రీ ప్రతిభ జూనియర్ కాలేజ్ ఫర్ గరల్స్ అని కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తోందని, చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనుమతులు లేకుండా కళాశాల యాజమాన్యం విద్యార్థులను చేర్చుకుంటోందని, విచారణ చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు.

6 కేంద్రాలు.. 4,415 మంది అభ్యర్థులు

గ్రూప్–2 పరీక్షలకు సర్వం సిద్ధం

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్–2 పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని 6 కేంద్రాల్లో పరీక్షలకు 4,415 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటల లోపు, మధ్యాహ్నం 2.30 గంటలలోపు కేంద్రాల్లోకి చేరుకోవాలని అధికారులు సూచించారు. ఉదయం 9.45 గంటల తర్వాత గేట్లు మూసివేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బీసీఆర్ పీసీ సెక్షన్ విధించి రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు సమీపంలో జిరాక్స్ సెంటర్లు సైతం మూసివేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థుల సందేహాల నివృతికి కలెక్టరేట్‌లో సెల్ 99122 44293, 80085 39786 నంబర్లలో అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ముగిసిన టీసీసీ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 21 మందికి ఐదుగురు, హయ్యర్ పరీక్షకు 9 మందికి ఐదుగురు హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

25 నుంచి వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శైవక్షేత్రంలో ఈనెల 25, 26, 27వ తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు శ్రీ బాలాత్రిపుర సుందరీ పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. శనివారం పీఠం ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 25న ఉదయం 9.23 గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు మేధా సరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన, ధ్వజారోహణ, రాత్రి భూప్రస్తార శ్రీచక్రార్చన జరుగుతుందన్నారు. 26న స్ఫటిక లింగేశ్వరస్వామి వారికి మానస సరోవర జలంతో అభిషేకం, రాత్రికి శివపార్వతుల కల్యాణం, 27న గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ



ఏలూరులో శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లాకు సంబంధించి విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓలకు రెండో విడత శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విధులు, ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులను ప్రశ్నలు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారన్నారు. బ్యాలెట్ పేపర్‌ను మడతపెట్టి బాక్సులో వేయడంపై అవగాహన కల్పించారు. పీఓ, ఏపీఓలు ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా చదివి అవగాహనతో పకడ్బందీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. మాస్టర్ ట్రెయినీలు శ్రీనివాస్, ఫణి ఓటు వేసే విధానం, పోలింగ్ సిబ్బంది నియామకం, పోలింగ్ మెటీరియల్స్, ముఖ్యమైన ఎన్నికల సామగ్రి తనిఖీ, పోలింగ్ కేంద్రానికి చేరిన వెంటనే చేయాల్సిన విధులు, పోలింగ్ రోజు విధులు తదితరాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల అధికారులకు బ్యాలెట్ బాక్సు ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడంపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి తదితరులు ఉన్నారు.

భార్యాబాధితుల సంఘం.. ఓ వర్గానికి ఊరట కోసం

- పెరుగుతున్న బాధితులు
- మగాళ్లకూ రక్షణ కావాల్సిందే..
- జాతీయస్థాయిలో ఉద్యమం
- తెలుగు రాష్ట్రాల్లో శాఖల ఏర్పాటు
- గూడెంలో ఆవిర్భవించిన సంఘం



తాడేపల్లిగూడెం: భార్యాభర్తలు.. అన్యోన్య దాంపత్యానికి ప్రతిరూపాలు.. ఒకరికి ఒకరై.. కష్టసుఖాల్లో తోడుంటూ.. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాల్సిన దంపతులు అహం, అహంకారం, అవగాహన లేమితో నిండు జీవితాల్లో నిప్పులు పోసుకుంటున్నారు. చట్టాల్లో వెసులుబాటును ఆసరాగా తీసుకుని కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరకట్న వేధింపుల నివారణ, గృహహింస చట్టాలు కొందరు మహిళలకు ఆయుధంగా మారాయి. ఇలా భార్యల వల్ల ఇబ్బందులు పడుతున్న కొందరు ఏర్పాటుచేసుకున్న సంఘమే భార్యాబాధితుల సంఘం. 2010లో తాడేపల్లిగూడెంలో పురుడు పోసుకున్న సంఘం దేశవ్యాప్తంగా శాఖలుగా విస్తరించింది. తాడేపల్లిగూడెం, నందిగామ, హైదరాబాద్, ఖమ్మంలో ముఖ్య శాఖలుగా చైతన్య వంతమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ భార్యాబాధితులకు బాసటగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన ఈ సంఘంలో సుమారు 10 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. 25 మంది క్రియాశీలకంగా కోర్ కమిటీగా ఏర్పడి సంఘం తరఫున న్యాయం కోసం గళం విప్పుతున్నారు.



భార్యాబాధితుల సంఘం క్యాలెండర్

ఫిర్యాదుల స్వీకరణే.. కేసులు నమోదు కాలేదు

భార్యాబాధితుల సంఘం తరఫున బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా తమ గోడు వెళ్లబోసుకుంటూ ప్రజాప్రతినిధులకు, పోలీసులకు పలు ఫిర్యాదు అందించారు. అయితే ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం 498 (ఎ) సెక్షన్‌లో కల్పించిన స్టేషన్ బెయిల్ వెసులుబాటు మాత్రమే భార్యాబాధితుల సంఘానికి కాసింత ఊరట.

దేశవ్యాప్తంగా కార్యకలాపాలు



నా భార్య నా మీద అసత్య ఆరోపణలతో కేసులు వేసి హింసించింది. విడాకులయ్యాయి. ఈ నేపథ్యంలో 2010లో 35 మంది సభ్యులతో సంఘం స్థాపించా. అమెరికా, మలేషియా, దుబాయ్‌ల నుంచి కూడా భార్యాబాధితులు ఫోన్‌లో సంప్రదిస్తున్నారు. మా సంఘం దేశవ్యాప్తంగా కార్యకలాపాలు చేస్తుంది. మాకు 13 డిమాండ్లు ఉన్నాయి. భార్యాబాధితుల రక్షణ కోసం చట్టాలు రావాల్సిందే. గౌరవం కోల్పోతున్నాం, మనశ్శాంతి ఉండటం లేదు. వ్యసనాలకు బానిసలవుతున్నాం. ఎందరో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తప్పు లేకుండా పరిహారాలు కోరవద్దు. మా ఆస్తులకు మమ్మల్ని దూరం చేస్తున్నారు. భార్యలతో ఇబ్బంది పడే భర్తల తరఫున పోరాటం కొనసాగుతుంది.

– జి.బాలాజీ రెడ్డి, భార్యాబాధితుల సంఘం జాతీయ అధ్యక్షుడు

మార్గదర్శకాలకు లోబడే చర్యలు

భార్యాబాధితుల సంఘం తమ బాధలను వ్యక్తం చేసుకుని ఉనికిని తెలియజేసే ఒక సంఘం మాత్రమే. కుటుంబాల మధ్య వచ్చిన విభేదాలు చట్టం పరిధిలోనే పరిష్కారం కావాలి. సంఘాల తరఫున పోరాటం చేసినంత మాత్రాన కేసులు నమోదు చేసే అవకాశం లేదు. వారి ఆవేదనను వ్యక్తం చేసుకునే వేదికగా మాత్రమే భార్యాబాధితుల సంఘం పోరాటం చేస్తోంది. సంఘం ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని కేసులు, నిర్ణయాలు వెలువడే అవకాశం లేదు. న్యాయస్థానాల మార్గదర్శకాలకు లోబడి మాత్రమే చర్యలు ఉంటాయి.

– దశిక మురళీకృష్ణ, హైకోర్టు సీనియర్ న్యాయవాది

భార్యాబాధితుల సంఘం డిమాండ్లు

- 498 (ఎ) గృహ హింస కేసు పెట్టిన ఏడాది తర్వాత కేసు తేలినా, తేలకపోయినా కోర్టు విడాకులు మంజూరు చేసి, రెండో వివాహానికి అనుమతి ఇవ్వాలి.
- 498 (ఎ) గృహ హింస తప్పుడు కేసు అని తేలితే భార్య, భార్య తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు శిక్ష, భర్తలకు నష్టపరిహారం, పరువు మర్యాదలు ఇప్పించాలి.
- భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు భర్తలు, భర్తల కుటుంబాలందరికీ కూడా కౌన్సెలింగ్‌లు ఇచ్చి సరైన న్యాయం జరిగేలా చూడాలి.
- భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు హాజరు కావాలి. అలా రెండు సార్లు హాజరు కాని పక్షంలో ఆ కేసులను పూర్తిగా రద్దు చేయాలి
- ఎంసీ, డీవీసీ (డొమెస్టిక్ వయొలెన్స్)లను చట్టం నుంచి పూర్తిగా రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న కేసులను రద్దు చేసి, జైలు శిక్షలు అనుభవిస్తున్న వారిని వెంటనే విడుదల చేయాలి
- పూర్వం ఈ కేసుల వల్ల నష్టపోయిన వారికి భార్యలతో ఆ నష్టపరిహారాన్ని ఇప్పించి ఒక ఏడాది భార్యలకు, భార్యల తల్లిదండ్రులకు జైలు శిక్ష మంజూరు చేయాలి.
- భర్తలు అవసరం లేదని వెళ్లిన భార్యలకు నష్ట పరిహారం చెల్లించకూడదు.
- గృహ హింస కేసు పెట్టిన తర్వాత భార్యాభర్తలిద్దరి శాంపిల్స్ డీఎన్ఏ టెస్ట్‌లకు పంపాలి.
- భార్యలు కేసులు పెట్టిన తర్వాత ఒక వేళ పిల్లలు ఉంటే భార్యల వద్ద నాలుగు రోజులు, భర్తల వద్ద మూడు రోజులు ఉండేటట్లు అనుమతినివ్వాలి.
- భార్యలు పెట్టిన కేసుల వల్ల భర్తలకు ఉద్యోగాలు పోకుండా చూడాలి. భర్తలు, వారి తల్లిదండ్రులు కష్టపడి సంపాదించుకున్న ఆస్తిపాస్తులు భార్యా పిల్లలకు చెందకూడదు.
- పెళ్లి అయిన ఏడాది తర్వాత నుంచి భార్యలు పుట్టింటికి చూడటానికి వెళితే నెల రోజులలోపు భర్తల దగ్గరకు రావాలి. అలా రాని యెడల భర్తలకు విడాకులు మంజూరు చేయాలి.
- భర్తల దగ్గర నుంచి భార్యలు విడాకులు తీసుకున్న తర్వాత భార్యలు, పిల్లలు భర్తల ఇంటి పేర్లను ఎటువంటి వాటిలో ఉపయోగించకూడదు. అలా ఉపయోగించిన పక్షంలో కోర్టు శిక్ష విధించాలి.
- మహిళలకు ఎటువంటి చట్టాలు, పథకాలు ఇచ్చారో అలాంటి చట్టాలు, పథకాలు పురుషులకు కూడా ఇవ్వాలి.

క్లుప్తంగా

ఫుట్‌బాల్‌లో భారత్ విజయంపై హర్షం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: దుబాయిలో జరుగుతున్న పింక్ లేడీస్ కప్ పోటీల్లో జోర్డాన్‌పై భారత్ 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించడంపై ఆంధ్ర ప్రదేశ్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో రష్యా, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్, థాయిలాండ్, జోర్డాన్ దేశాల బాలికల జట్లు పాల్గొన్నాయని ఆయన తెలిపారు. తొలి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడం వెనుక నైపుణ్యత కలిగిన శిక్షణ, జట్టులోని బాలికల నిరంతర సాధన, పట్టుదల, క్రమశిక్షణ ఉన్నాయని పేర్కొన్నారు. జట్టు హెడ్ కోచ్‌తో పాటు భారత జట్టు బాలికలకు ఆయన అభినందనలు తెలిపారు.

హ్యాండ్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

దెందులూరు: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాలికల జట్టును(జేఎన్‌టీయూ, కాకినాడ) సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందని వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధి తెలిపారు. శనివారం కళాశాలలో జట్టు వివరాలను ప్రకటించారు. తమిళనాడు రాష్ట్రం సేలం యూనివర్సిటీలో మార్చి 3 నుంచి 7 వరకు జరిగే వాలీబాల్ పోటీల్లో ఆడతారన్నారు.

జట్టు వివరాలు

కే సంధ్య, జీ ప్రవళిక సత్య, జీ లావణ్య అనుసాయి, కే దుర్గ, బీ వెంకట కావ్య, సీహెచ్ రాణి ప్రవళిక, వీ శాంభవి, ఆర్.వెంకట స్వప్న, పీ కల్పన, ఆర్.సౌజన్య, కే సుజాత, పీ లక్ష్మి ప్రసన్న, బీరమ్య, పీ రమ్యశ్రీ, బీ సుచిత్రను ఎంపిక చేశామన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఎటుచూసినా భక్తులతో కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ఉచిత అన్నప్రసాదం కోసం వకుళమాత నిత్యాన్నదాన భవనం వద్ద భక్తులు బారులు తీరారు. రాత్రి వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గలేదు.

ఆక్వాకు అండగా మత్స్య కిసాన్



భీమవరం ప్రాంతంలో రొయ్యల చెరువులు(ఫైల్)

భీమవరం: ఆక్వా రంగంలో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన పథకంలో బీమా పథకం ప్రవేశపెట్టింది. ఈ బీమా పథకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

బీమా పథకం విధి విధానాలు..

ఆక్వా పంట సాగు 180 రోజుల ప్రీమియం ధర తొలి 60 రోజులకు వర్తిస్తుంది. తరువాత ప్రతి 30 రోజులకు నిర్ణీత ప్రీమియం చెల్లించాలి. బీమా ఒక పంట కాలానికి మాత్రమే వర్తిస్తుంది. చెరువుల్లో రొయ్య పిల్లలు వేసిన తరవాత ఎక్కువ సంఖ్యలో రొయ్యలుంటే సాధరణంగా రైతులు మధ్యలో పట్టుబడి చేస్తుంటారు. అలా ఏ కారణంచేతనైనా మధ్యలో పట్టుబడి చేస్తే బీమా కాల పరిమితి ముగిసినట్టే. పంట మొత్తం పాడైతేనే బీమా వర్తిస్తుంది. బీమా వర్తించిన పంటకు బీమా సొమ్ములో 80 శాతం తిరిగి రైతుకు చెల్లిస్తారు. బీమా చెల్లించిన రైతులు తమ చెరువుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి. రొయ్యలు పాడైపోతే సమూనాలు ల్యాబ్‌లో పరీక్ష చేయించి 24 గంటల్లో బీమా కంపెనీకి రిపోర్టు ఇవ్వాలి. కంపెనీ ప్రతినిధులు సరుకును పరిశీలించి నిర్ధారించిన తరవాత పట్టుబడి చేయాలి. రావడం ఆలస్యమైతే రొయ్యల పట్టుబడిని సీసీ కెమెరాలు లేదా జియోట్యాగింగ్, పట్టిన తేదీ, సమయం కలిపి సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి బీమా కంపెనీ ప్రతినిధులకు అందించాలి.

రెండు రకాల బీమా

బేసిక్ కవరేజ్ స్కీంలో ప్రీమియం లక్షకు రూ.3,100 చెల్లించాలి.. దీనికి జీఎస్టీ అదనం. బీమా చెల్లించినా వరదలు, భారీ వర్షా కారణంగా చెరువులు ముంపునకు గురికావడం, కాలుష్య కారణాల వల్ల సరుకు పాడైనప్పుడు, చెరువులో విష ప్రయోగం జరిగి రొయ్యలు మత్యువాత పడినప్పుడు, తెగుళ్ల కారణంగా పాడైన చెరువులకు బీమా వర్తించదు. కాంప్రహెన్సివ్ కవరేజ్: ప్రీమియం రూ. 6 వేలు చెల్లిస్తే బేసిక్ కవరేజీలో ఉన్న వాటితోపాటు వ్యాధుల వల్ల సరుకు పాడైన చెరువులకు బీమా వర్తిస్తుంది.

రైతులకు ప్రయోజనం



ప్రధానమంత్రి మత్స్య కిసాన్ ఆక్వా సమృద్ధి సహ యోజన పథకంలో తెచ్చిన బీమా పథకం రైతులకు ఎంతో ప్రయోజకరం. రెండు విధానాల్లో బీమా చెల్లించే అవకాశముున్నందున రైతులు తమకు ఇష్టమైన పథకాన్ని ఎంచుకోవచ్చు. ఆక్వా బీమా పథకంపై జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్‌వీ ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, భీమవరం

హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లకే ప్రయోజనం



ఆక్వా రంగానికి గతంలో కూడా బీమా అవకాశం కలిపించారు. ఈ పథకం రైతుల కంటే హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ఎంపెడా ఆధ్వర్యంలో రైతులకు ఎక్కువ ప్రయోజనం కల్పించేలా కృషిచేయాలి. దీనిపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి.

– గాదిరాజు సుబ్బరాజు, ఆక్వా రైతుల సంఘం కార్యదర్శి

కార్మికులకు కన్నీళ్లే

- కంటి తుడుపుగా ఈ–శ్రమ పోర్టల్
- అమలు కాని కార్మిక సంక్షేమ పథకాలు



అంసంఘటిత రంగ కార్మికులు(ఫైల్)

ఆకివీడు : కార్మికుల కోసం అనేక చట్టాలు అమలులో ఉన్నా వాటి ప్రయోజనం మాత్రం లబ్ధిదారులకు అందడం లేదు. జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల వివరాల్ని ఈ–శ్రమ యాప్‌లో నమోదు చేయిస్తున్నారు. ఈ పోర్టల్‌లో నమోదు చేయడం వల్ల కార్మికులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. అయితే ఇంతవరకూ అమల్లో ఉన్న ఏ పథకం వల్ల తమకు ప్రయోజనం అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల కోసం యాజమాన్యం రూపాయి కార్మిక ఫండ్‌గా చెల్లిస్తోంది. కార్మిక సంక్షేమం కోసం ఈ సొమ్మును వినియోగించాల్సి ఉండగా, ఈ నిధి తమకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదని కార్మికులు అంటున్నారు. కనీస వేతన చట్టం కనుమరుగైపోయింది. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకనుగుణంగా కార్మికులకు వేతనాలు చెల్లించాలనే డిమాండ్ అమలు చేయడం లేదు. కార్మికులకు రూ.3 వేలు ప్రావిడెంట్ ఫండ్ ఇస్తామని బీజేపీ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని మర్చిపోయింది. 2024 ఎన్నికల్లో రూ.5 వేలు చేస్తామన్న చెప్పినా.. ఇంతవరకూ అమలు దిశగా ఎలాంటి చర్యలు లేవంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికుల వివరాలు	అసంఘటిత	భవన నిర్మాణ	సంఘటిత
ఏలూరు	5,35,391	3,63,063	1,35,723
పశ్చిమ గోదావరి	6,50,200	4,50,200	45,000

రూ.10 లక్షల చంద్రన్న బీమా ఏమైంది?

గత ఎన్నికల్లో చంద్రన్న బీమా సౌకర్యాన్ని రూ.10 లక్షలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు ఏమైందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ.5 లక్షలు వైఎస్సార్ బీమాగా చెల్లించేవారు. ప్రమాద బీమాను ఎన్నికల నినాదంగా వాడుకున్న కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలైనా బీమా ఊసే ఎత్తడంలేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈఎస్‌ఐ ఆసుపత్రులు దిష్టిబొమ్మల్లా ఉన్నాయని పలువురు కార్మికులు, కార్మిక సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. ఈఎస్‌ఐ డిస్పెన్సరీల్లో కనీస మందులు ఉండడం లేదు. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపలిగూడెంలలోని డిస్పెన్సరీల్లో పర్మినెంట్ వైద్యులు అందుబాటులో లేరు.

కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని హరించివేస్తున్నారని సీఐటీయూ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ తప్పుపట్టారు. ఉద్యమాలతో పుట్టిన చట్టాల్ని రక్షించుకునేందుకు కార్మికులు సంఘటితం కావాలన్నారు. కార్మిక చట్టాల్ని పునరుద్ధరించి, దేశ ప్రగతికి ప్రభుత్వాలు నడుం బిగించాలని, సంక్షేమ నిధి, ఈఎస్‌ఐలను అభివృద్ధి చేయాలని సీఐటీయు ఆకివీడు మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు అన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయ ధ్వజస్తంభం వద్ద నిర్మించిన చలువ పందిరి

గర్భాలయంలో విశేష అలంకారాల్లో కొలువైన శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే సిబ్బంది ఆలయంలో చలువ పందిళ్లను నిర్మించి, యాగశాలలను సిద్ధం చేశారు. ఆలయానికి, పరిసరాలకు రంగులు వేసి, విద్యుద్దీప తోరణాలతో సుందరీకరించారు. ఆలయాన్ని కడిగి శుభ్రం చేసి, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. వచ్చే నెల 1 వరకు ఆలయంలో ఈ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. అందులో భాగంగా ఈ నెల 23న ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 24న ఉదయం వేదపారాయణ, శివయ్యకు అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి విఘ్నేశ్వర పూజ, శైవ పుణ్యాహవాచన, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన, అంకురార్పణ, మంటపార్చన, ధ్వజారోహణ, బలిహరణలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. 25న రాత్రి గ్రామోత్సవం, 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 4గంటలకు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, వేదపారాయణలు, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల అభిషేకం, అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. 27న ఉదయం అభిషేకం, కుంకుమార్చనలు, సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం, 28న ఉదయం 8 గంటలకు అభిషేకం, కుంకుమార్చన, అనంతరం 9గంటలకు త్రిశూలవారి, వసంతోత్సవం, గ్రామోత్సవం, పూర్ణాహూతి, దీక్ష విరమణ, ధ్వజావరోహణ, రాత్రి 7గంటలకు ఆలయద్వాదశ కోవెల ప్రదక్షిణలు, జరుగుతాయన్నారు. వచ్చే నెల 1న రాత్రి 8 గంటలకు జరిగే శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు.

బలివే ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు



బలివేలో క్యూలైన్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, జిల్లా ఎస్పీ

బలివే(ముసునూరు): బలివే ఉత్సవాల్లో భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉత్సవాల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఎక్కువ భక్తులు హాజరయ్యేలా ఉత్సవాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేవదాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో భక్తుల పుణ్యస్నానాలు, పిండ ప్రదానాలు, అభిషేకాలు, దైవ దర్శనానికి, ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రసాదాల కౌంటర్లు, స్నాన ఘట్టాలు, మంచినీరు, మజ్జిగ అందించే చోట్ల రద్దీ నివారణకు క్యూ లైన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సుమారు 400 మంది పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో, నిత్యం సీసీ కెమెరాల నిఘాతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు స్నానఘట్టాల వద్ద జల్లు స్నానాలు, పిండ ప్రదానాల ప్రదేశాలను పరిశీలించి, ఏక కాలంలో 120 మంది భక్తులు జల్లు స్నానాలు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతరం ఎస్పీతో కలసి ఆలయ ప్రాంగణం లోపల, వెలుపల, ప్రసాదాల కౌంటర్ల వద్ద, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లను, పందిళ్లను పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, డీఎల్పీఓ సుందరి, ఎంపీడీఓ జి.రాణి తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా నాటకోత్సవాలు



అనూహ్యం నాటికలో ఆసక్తికర సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో గరికపాటి నాటకోత్సవాలు –2025 శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఎంహెచ్‌ఏ హాలులో తొలి ప్రదర్శనగా పాలకొల్లుకు చెందిన నటీనట సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన ×అనూహ్యం₹ ప్రేక్షకుల్ని ఆలోచింపచేసింది. తాళాబత్తుల వేంకటేశ్వరరావు రచించిన ఈ నాటికకు కత్తుల రామమోహనరావు దర్శకత్వం వహించారు. అనంతరం గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ×తరమెల్లిపోతున్నదో₹ నాటిక ప్రజల అభిమానాన్ని పొందింది. ఈ నాటికకు బొమ్మిడి రామకృష్ణ రచన, దర్శకత్వం వహించారు. అంతకు ముందు అతిథులు నటరాజ స్వామి పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సభకు గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథులుగా సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు, లంకా లక్ష్మీనారాయణ, అతిథులుగా వీవీవీ హనుమంతరావు, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, పెదపాటి రామకృష్ణ, సినీ రచయిత పమిడిపాటి రాజేంద్ర కుమార్, జమలాపురం రాధాకృష్ణ, బుద్దాల వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం పట్టణానికి చెందిన ఉప్పల శ్రీనివాసరావు కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఈ నెల 20న రాత్రి తన ఇంటి వద్ద బైక్ పార్క్ చేశారు. 21వ తేదీ ఉదయం చూసే సరికి బైక్ కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ Diploma & Engineering Admissions Reg. by Central & State Governments. Eligible for all Govt.Jobs & Promotions SRM College Ph: 94401 11487 [SCA25001848]

PARAMEDICAL

■ పారామెడికల్ Diploma in Medical Laboratory Technology, Diploma in Operation Theater Teachnology, Diploma in Anaesthesia Technology, Diploma in Cardiology, MPHA కోర్సు, Inter, MLT. Inter MPHW (F) అడ్మిషన్లు జరుగుచున్నవి. తమ్మినేని ఇనిస్టిట్యూట్, విజయవాడ. డా॥ టి. రామకృష్ణ ✆ 98482 42880. [B-1268423]

Real Estate

TO-LET

■ భీమవరం బ్యాంకు కాలనీ వీరాస్వామినగర్ రోడ్, 5వ వాటర్ ట్యాంకు గేట్ ఎదురుగా ఫస్ట్ ఫ్లోర్ 19–17–5/1. కాంటాక్ట్ : 98855 33461 [SCA25001826]

COMMERCIAL FOR SALE

■ Vijayawada, Bhavanipuram, 1519 sq.yds, Open land for sale. Commercial use, By-Pass Road, Beside Bhashyam School. Ph: 9949321555, 9848041664 [HA-99850]

REAL ESTATE

■ తణుకు బైపాస్, చివటం రోడ్ 290 Yds. సైట్ & హౌస్. నార్త్ ఈస్ట్ కార్నర్, ఈస్ట్ ఫేసింగ్, 80 Ft. రోడ్, కమర్షియల్ / హౌస్ యూజ్. ఫోన్ : 96770 65411, 91008 33357 [SCA25001715]

PLOT FOR SALE

■ విజయవాడ నూజివీడులో ఆనంద్ విహార్ మెగా వెంచర్ లో CRDA అప్రూవల్ తో గజం కేవలం "5800" మాత్రమే అన్ని వసతులతో ఇల్లు కట్టుకొనుటకు అనువైన వెంచర్ సెల్: 9347756501. [SCA25001820]

Services

నర్సరీ

■ మా వద్ద మేలు జాతికి చెందిన శ్రీగంధం, ఎర్రచందనం, జామ, మామిడి, దానిమ్మ, నిమ్మ, బత్తాయి మొక్కలు లభించును. సంప్ర॥ K.V. రాజు ✆ 96188 93279. [B-752859]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6239]

Wanted

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44622 [B-1266928]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA25001814]

■ సాయిరామ్ హోమ్‌కేర్:Hydలో బేబీకేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు, నర్సులు & ఇంటి/వంటపనికి కావలెను.జీ:18వేలు✆9949094607, 99084 54607 [SCA25001783]

■ కష్టలేని కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd.ఫోన్: 9666253675 [HA-99924]

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పనిచేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/ మగ/ జంట కావలెను. ఫోన్: 9347556162/ 8309615249 [DA-56921]

■ భీమవరం యమహా షోరూమ్ నందు పనిచేయుటకు క్యాషియర్ కమ్ అకౌంటెంట్ కావలెను. 2 సం.అనుభవం కావలెను. సంప్ర. 96185 55588, 83677 91999. [SCA25001846]

■ శ్రీ విద్యాలయ జూనియర్ కాలేజీలో ఫ్లోర్ ఇంఛార్జ్ & కోఆర్డినేటర్స్ (M) కావలెను. NRPETA ఏలూరు, డైరెక్టర్ మళ్ళ నాగార్జున సం.ప్ర: 97059 97268, 99489 09938 [SCA-25001631]

■ సాయి సుధా ఏజెన్సీస్,గాయత్రి నగర్ (కైకలూరు రోడ్డు) ఏలూరు నందు పనిచేయుటకు సేల్స్ మాన్ & డెలివరీ బాయ్స్ కావలెను. సం.ప్ర: 94403 21333, 94401 85556 [SCA-25001748]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపై చదివి20–50 సం॥ స్త్రీ/పు టెలికాలర్స్, సూ॥వైజర్లు, అడ్మిన్లు, అకౌంటెంట్లు,కా॥.బో+వ+జీ20–30వేలు . ఫోన్: 9491651122, 9491821122 [SCA25001389]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆగిరిపల్లిలో చికెన్ మేళా



చికెన్ వంటకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆగిరిపల్లి: వెంకటేశ్వర హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో చికెన్ ఫుడ్ మేళా నిర్వహించారు. బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించేందుకు స్థానిక బస్టాండ్ వద్ద నిర్వాహకులు చికెన్ వంటకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఉడికించిన, చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదని నిర్వాహకులు వివరించారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రమ్య

నూజివీడు: కాలేజీకి వెళ్లలేదని తల్లి మందలించడంతో పట్టణంలోని బాపూనగర్‌కు చెందిన బత్ర వెంకట రమ్య(18) శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికంగా ఉన్న ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో వెంకట రమ్య పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కాలేజీకి వెళ్లలేదని తల్లి రమ్యను మందలించింది. మనస్తాపానికి గురైన యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు చూసి పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు.



SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

ఆఫీస్ చిరునామా : డి.నెం.6-12-5/1, 2వ అంతస్తు, పీరుగంటివారి వీధి, ఇన్నీసుపేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101.

స్వాధీనత ప్రకటన

మేము మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్") గా పిలువబడెను, NCLT, చెన్నై, తేది.08.11.2022, సి.పి.నెం.69-76 ఆఫ్ 2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం [illegible] RBI నుండి [illegible] శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు బ్రాంచ్ ఆఫీస్ నిడదవోలు [illegible] -534301, పశ్చిమ గోదావరి జిల్లా [illegible]

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) [illegible] సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3 [illegible] సెక్షన్ 13(12) [illegible] శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible] డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

[illegible] సెక్షన్ 13(4) [illegible] 19.02.2025 తేదీన స్వాధీనం చేసుకున్నారు.

ఋణగ్రహీత మరియు గ్యారంటర్ల పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తము బకాయి	ఆస్తిని స్వాధీన పర్చుకోబడిన తేది
1) గోగులమండ లక్ష్మి, భర్త. విజయ్ వినాద్, శ్రీ ధనలక్ష్మి ఫిష్ ట్రేడింగ్ [illegible], డి.నెం.2-7/1-14ఎ, సంజీవ్ నగర్, వార్డు నెం.6, నిడదవోలు-534301, పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా. 2) గోగులమండ విజయ్ వినాద్, [illegible] డి.నెం.24-9-11, [illegible] -534202, పశ్చిమ గోదావరి జిల్లా. 3) తోట [illegible], తండ్రి. నాగరాజు, [illegible] డి.నెం.2-7-24/1, [illegible] నిడదవోలు-534301, పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా.	లోన్ అకౌంట్ నెంబరు : NDVL1TF2201280004 కు రూ.48,01,560/- (అక్షరాల నలభై ఎనిమిది లక్షల ఒక వెయ్యి ఐదు వందల అరవై రూపాయలు మాత్రమే) డిమాండ్ నోటీసు తేది.29.06.2024	19.02.2025

దస్తావేజు నెం.737/2022 (ఎస్‌ఆర్‌ఓ) ఎస్.ఆర్.ఓ నిడదవోలు వారి గోగులమండ లక్ష్మి గారు తనఖా ఉంచిన రిజిస్టర్డ్ ఆస్తి

పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు సబ్-జిల్లా, నిడదవోలు మండలం, నిడదవోలు మున్సిపల్ ఏరియా, నిడదవోలు టౌన్, పాత ఆర్.ఎస్.నెం.46 మరియు కొత్త ఆర్.ఎస్.నెం.834/1 నందు విస్తీర్ణం 312 చ.గజాలు లేదా 297.649 చ.మీ.లలోని స్థలంతో పాటు ఆర్‌సిసి భవనం గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 1000 చ.అడుగులు డి.నెం.2-7-8/1, అసెస్‌మెంట్ నెం.1078007105 తో కలదు. హద్దులు : తూర్పు : [illegible] – 42.0 అడుగులు, దక్షిణం : [illegible] – 75.0 అడుగులు, పడమర : రోడ్డు – 42.0 అడుగులు, ఉత్తరం : [illegible] – 75.0 అడుగులు.

[illegible] శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ [illegible]

తేది : 19.02.2025, స్థలం : రాజమండ్రి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్